సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



గుంతలతో దినదినగండం

చింతలపూడి, భీమడోలు ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా మారాయి. వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లపై రాకపోకలు వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. 8లో ▸



విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఉత్తీర్ణత సాధించినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. ఏలూరులో శనివారం ఈ ఘటన జరిగింది. 8లో ▸



గుట్టలు.. గుట్టుగా మాయం

పర్యావరణానికి, వన సంపదకు కేంద్రాలుగా ఉన్న గుట్టలను పట్టపగలే హరించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

టెట్.. తొలిరోజు ప్రశాంతం



డీఎన్నార్ కళాశాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

భీమవరం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) భీమవరం పట్టణంలో శనివారం ప్రారంభమైంది. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రెండు సెషన్లలో నిర్వహించిన తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పరీక్షకు 90 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 77 మంది, మధ్యాహ్నం పరీక్షకు 90 మందికి గాను 75 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని పేర్కొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



స్పేస్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

భీమవరం: విద్యార్థులు మంచి విద్యాభ్యాసంతో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. ఇస్రో అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విష్ణు స్కూల్ ఆధ్వర్యంలో స్పేస్ వాక్ కార్యక్రమాన్ని శనివారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్య పట్ల శ్రద్ధ చూపుతూ ఉన్నత విలువలతో కూడిన జీవనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మన చదువు దేశ ప్రగతికి దోహదపడేలా మంచి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో విష్ణు స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.బిందు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాగళాన్ని చట్ట సభల్లో వినిపిస్తా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి




యలమంచిలి: ప్రజాగళాన్ని చట్ట సభల్లో వినిపించేందుకు తనకొక అవకాశం ఇవ్వాలని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి కోరారు. షేక్ సాబ్జి అకాల మరణంతో ఖాళీ అయిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి స్థానానికి యూటీఎఫ్ మద్దతుతో పీడీఎఫ్ అభ్యర్థిగా మండలంలోని నారినమెరక గ్రామానికి చెందిన బొర్రా గోపిమూర్తి పోటీ చేస్తున్నారు. ఆయన శనివారం తన స్వగ్రామం నారినమెరక నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మూర్తి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చట్టసభల్లో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ గోపిమూర్తి యూటీఎఫ్‌లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పలు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఆయన విజయానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం మాట్లాడుతూ ఇంకా ఓటు నమోదు చేసుకోవలసిన ఉపాధ్యాయులు అక్టోబర్ 15లోగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్గదర్శకులు ఉపాధ్యాయులే

పాలకొల్లు సెంట్రల్: సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, అటువంటి వారికి సముచిత గౌరవం ఇవ్వవలసిన బాధ్యత మనందరిపైనా ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక రామచంద్రా గార్డెన్స్‌లో ధర్మారాపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 125 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను సత్కరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పెట్టుబడి సాయమేదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతన్నలకు ఏడాదికి రూ.20 వేల చొప్పన అందజేస్తాం.
- సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన సభల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీ ఇది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలై మూడు నెలలైంది. రైతు భరోసాపై ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు ఇప్పటివరకు దానిపై నోరు మెదపడం లేదు. ఇప్పటికే పీఎం కిసాన్ తొలి విడత సాయం అందించిన కేంద్రం.. శనివారం రెండో విడత సాయం విడుదల చేసింది. మరోపక్క అన్నదాత సుఖీభవ సాయంపై చంద్రబాబు స్పష్టతనివ్వడం లేదు. రెండో విడత కూడా వచ్చేసినా దీనిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇప్పటికే భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టాలు చవిచూసిన అన్నదాతలు ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందించకపోవడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు.

- రెండో విడత సాయం విడుదల చేసిన కేంద్రం
- జిల్లాలో 86,610 మంది రైతులకు రూ.17.32 కోట్ల లబ్ధి
- రాష్ట్రం వాటాపై నోరెత్తని చంద్రబాబు ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఖరీఫ్ మొదలై మూడు నెలలైనా ఆ ఊసెత్తని బాబు
- వరుస విపత్తులతో తొలకరి నష్టపోయిన రైతులు
- అన్నదాత సుఖీభవ సాయం కోసం ఎదురుచూపులు
- జగన్ ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా సాయం ఠంచనుగా పంపిణీ
- గత ఐదేళ్లలో 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్ల లబ్ధి
- వైఎస్సార్‌సీపీ హయాంలో సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం





సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అధిక శాతం విస్తీర్ణంలో వరి పంట చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశల్లో ఉంది. ప్రస్తుత దశ నాటికి ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చులవుతాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి భారీ వర్షాలు, వరదలు తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, భీమవరం తదితర నియోజకవర్గాల్లోని పంటకు తీవ్ర నష్టం కలుగజేశాయి. 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరా ల్లోని నారుమడులు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లో రెండోసారి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడి పెట్టుబడులు రెట్టింపై రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

గతంలో సాగుకు ముందే సాయం

గతంలో పెట్టుబడుల కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద ప్రభుత్వం రైతులకు సాయం అందించేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6000కు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 జత చేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా పంపిణీ చేసేది. తొలి విడతగా మే నెలలో రూ.7500 రైతుల ఖాతాలకు జమ చేసేది. ఖరీఫ్ చివర్లో పీఎం కిసాన్ రెండో విడత రూ.2000, రైతు భరోసా సాయం రెండో విడతగా రూ.2000 కలిపి రూ.4000 మొతాన్ని రైతుల ఖాతాలకు జమ చేసేవారు. తొలకరి పంట పెట్టుబడుల కోసం సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. గత ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు గత ప్రభుత్వంలో రూ.796.49 కోట్ల లబ్ధి చేకూరడం గమనార్హం.

కేంద్రం రెండో విడత పీఎం కిసాన్ సాయం విడుదల

జూన్‌లో పీఎం కిసాన్ తొలి విడత సాయం విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం.. రెండో విడతగా ఒక్కో రైతుకు రూ.2 వేలు చొప్పున జిల్లాలోని 86,610 మంది రైతులకు రూ.17.32 కోట్ల మొత్తాన్ని శనివారం రైతుల ఖాతాలకు జమచేసింది.

రూ. 20 వేల ఊసెత్తని కూటమి ప్రభుత్వం

తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. 'వైఎస్సార్ రైతుభరోసా' పేరును 'అన్నదాత సుఖీభవ'గా మార్చిన సీఎం చంద్రబాబు సాయం విడుదల ఊసెత్తడం లేదు. ఇప్పటికే పీఎం కిసాన్ పథకం రెండు విడతల్లో కేంద్రం రైతులకు రూ.4 వేలు సాయం అందించగా రాష్ట్ర ప్రభుత్వం పైసా విదల్చకపోవడం గమనార్హం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	సాయం (రూ.కోట్లలో)
2019–20	1,09,302	రూ. 147.56
2020–21	1,24,664	రూ. 168.30
2021–22	1,17,791	రూ. 159.02
2022–23	1,13,597	రూ. 153.36
2023–24	1,24,645	రూ. 168.17

రైతు వద్ద చిల్లిగవ్వ కూడా లేదు



రైతులకు పెట్టుబడి సాయంతో పాటు నష్టపరిహారం అందించకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గతంలోనూ చంద్రబాబు ప్రభుత్వం రైతులను విస్మరించింది. గత రెండు దఫాలుగా కురిసిన వర్షాల వల్ల కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఇప్పటివరకు రూ.10 వేల ఖర్చు అవుతుంది. కానీ రెండు సార్లు నాట్లు వేయడం వల్ల సుమారు ఎకరాకు రూ.18 వేలు ఖర్చయ్యింది. రెండు కోటాల మందుతో పాటు, ఎరువులు కూడా వేయాల్సి ఉంది. తీవ్రంగా కాస్తున్న ఎండల వల్ల చేలకు ఎండు తెగులు, ఎర్ర తెగులు వ్యాపిస్తున్నాయి. దీనికి అదనంగా పురుగు మందులు వాడాలి. రైతు వద్ద పెట్టుబడులకు చిల్లిగవ్వ కూడా లేదు. ఈ విషయంపై రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– దేవరశెట్టి రాంబాబు, కౌలు రైతు, బి.కొందేపాడు

మోసం చేయడం తగదు



ఈ ఏడాది సార్వా సాగు ప్రారంభం నుంచి రైతాంగం అవస్థలు పడుతూనే ఉన్నారు. ఓ వైపు ప్రకృతి ప్రకోపానికి, మరోవైపు ప్రభుత్వం మోసానికి రైతు ఆర్థికంగా చితికిపోయాడు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయం చేస్తానన్న హామీని నెరవేర్చకపోవడం దారుణం. కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్ సొమ్ములకు తోడు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న మొత్తాన్ని కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రైతులను నమ్మించి మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదు.
– చినిమిల్లి వీరబాబు, సర్వోదయ రైతు సంఘం నాయకుడు, కొప్పర్రు

బాబు సర్కారు తీరు దారుణం



రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం నాలుగు నెలలు గడిచినా రైతు భరోసాపై ఎటువంటి ప్రకటనా చేయకపోవడం దారుణం. కేంద్ర ప్రభుత్వం 13వ విడత రూ.2 వేలు వేసిన నేపథ్యంలో చంద్రబాబు కూడా రైతులకు హామీ మేరకు డబ్బులు వేయాలి. ఈ ఏడాది అకాల వర్షాల వల్ల ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు.
– కుక్కల బాలచంద్రన్, రైతు, మేడపాడు

పెట్టుబడి సాయం అందలేదు



గతంలో రబీ సాగుకు ముందే రైతు భరోసా మా ఖాతాల్లో జమ అయ్యేది. ఇప్పుడు సాగు పూర్తయి ఈనిక దశలో ఉన్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పెట్టుబడి సాయం అందలేదు. దీంతో సాగు పెట్టుబడి కోసం వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.
– తామరపల్లి మునలయ్య, పద్దిరెడ్డిపాలెం, ఇరగవరం మండలం

ఇప్పటికే నష్టాల్లో ఉన్నాం..



ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి పార్టీలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాలో ఇప్పటి వరకు పెట్టుబడి సాయం జమ చేయలేదు. ఇప్పటికే వర్షాలు, వరదల వల్ల రెండు పర్యాయాలు పంట నష్టపోయాం. గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం వచ్చేది.
– తోలేటి వెంకటేశ్వరరావు, రైతు, తిరుపతిపురం, అత్తిలి మండలం

ఇలాగైతే సాగుకు స్వస్తి చెప్పాల్సిందే



గోస్తనీ నది డ్రెయిన్ ముంపు కారణంగా రెండుసార్లు నారుమడులు, నాట్లు వేసి తీవ్రంగా నష్టపోయాం. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు. ఈ ప్రభుత్వంలో కౌలు వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉంది. సబ్సిడీ విత్తనాలు కూడా మాకు అందలేదు. ఇలా ఉంటే వ్యవసాయానికి స్వస్తి చెప్పాల్సిందే.
– పెచ్చెట్టి వీరయ్య, కౌలు రైతు, సోమరాజు ఇల్లిందలపర్రు, పెనుమంట్ర మండలం

ఇసుక దోపిడీని అరికట్టాలని ధర్నా




భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: ఉచిత ఇసుక పాలసీని పకడ్బందీగా అమలు చేయాలని, ఇసుక దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా నాయకుడు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ప్రజలకు ఇసుక అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. దీనివల్ల భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అనేక వృత్తుల వారు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణదారులు ఇసుకను అధిక ధరలకు కొనలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో నేడు ఇసుక ట్రాక్టర్ రూ.7 వేలకు విక్రయిస్తున్నారని, 10 యూనిట్ల లారీ రూ.30 వేల వరకు అమ్ముతున్నారని చెప్పారు. ఇసుక బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ఈ సందర్భంగా కోరారు. ఇసుక దోపిడీ రాత్రివేళల్లో నిరంతరాయంగా సాగుతోందని, ప్రభుత్వం దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ ఇసుక పాలసీని అమలు చేసే విషయంలో లేదని విమర్శించారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కె.కృష్ణ, కె.అప్పన్నరాజు, డి.త్రిమూర్తులు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంఘ జిల్లా కార్యదర్శి మునిస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు: గీత కార్మికులకు పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో కల్లు గీత కార్మిక సంఘం తణుకు డివిజన్ సమావేశం కడలి బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిస్వామి మాట్లాడుతూ కల్లుగీత వృత్తిని రాష్ట్ర ప్రభుత్వం రక్షించాలని, భక్షించకూడదని చెప్పారు. గీత కార్మికులకు అక్టోబరులో ప్రకటించాల్సిన పాలసీని ఇప్పటికీ ప్రకటించలేదని గుర్తుచేశారు. గీత కార్మికులకు లేని ఆశను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తూ లిక్కరు షాపుల్లో పది శాతం ఇస్తామని ప్రచారం చేస్తూ దానిని ప్రకటించకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. గ్రామాల్లో రియల్ ఎస్టేట్ పేరుతో తాటి, ఈత చెట్లు నరికివేస్తూ గీత కార్మికుల ఉపాధిని పోగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులకు వడ్డీ లేని రుణాలు బ్యాంకుల ద్వారా కల్పించాలని, కల్లును ఆధునికీకరణ చేయడంతో పాటు శీతలపానీయంగా గుర్తించాలని కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సంఘ నాయకులు గుబ్బల వీరరాఘవులు, కట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ప్రాక్టీస్ ఉంటే వదిలేయండి

- అందుబాటులో లేకుంటే కఠిన చర్యలు
- వైద్యారోగ్య శాఖ సమావేశంలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు ఏదైనా ప్రైవేట్ ప్రాక్టీస్ ఉంటే వాటిని వదిలి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. శనివారం భీమవరంలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో సంయుక్తంగా ఏర్పాటుచేసిన సమావేశానికి కలెక్టర్ హాజరై ఆయా శాఖల లక్ష్యాలు, సాధన, తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో వైద్య లోపం వల్ల తల్లి, బిడ్డ మరణం కూడా ఎట్టి పరిస్థితుల్లో సంభవించకూడదని, పీహెచ్‌సీ వైద్యులు నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు సమయపాలన తప్పక పాటించాలన్నారు. పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. సంబంధిత వైద్యాధికారి స్థానికంగానే నివాసం ఉండాలని సూచించారు. జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో అయినా డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు వస్తే ఒక హెచ్చరిక అనంతరం సంబంధిత వైద్యునిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనకు వైద్యులంటే చాలా గౌరవమని, చర్యలు తీసుకునే పరిస్థితి ఎవరూ తెచ్చుకోవద్దని సూచించారు.

పెరిగిన మాతృ మరణాల సంఖ్య...

జిల్లాలో మాతృ మరణాల సంఖ్య గత సంవత్సరంతో పోలిస్తే అధికంగా ఉందని కలెక్టర్ చెప్పారు. గర్భం దాల్చిన మహిళలు ఒకటికి, రెండుసార్లు అబార్షన్లు అయితే వారిని మరింత జాగ్రత్తగా వైద్య పరిశీలనలో ఉంచి సేవలందించాలని తెలిపారు. రక్తహీనత అనేది అన్ని వయసుల వారిలో ప్రస్తుతం కనిపిస్తున్నదన్నారు. గర్భవతులకు ఆహారం తీసుకునే విషయంలో అవగాహన కలిగించడంతో పాటు వారి సహాయకులకు కూడా వివరించాలన్నారు. వైద్యశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి మాతృ, శిశు మరణాలను నూరు శాతం అరికట్టాలని చెప్పారు. జిల్లాలో సుమారు ఏడు వేల మంది పోషకాహార లోపంతో ఇబ్బంది పడుతున్నట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ భాను నాయక్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.ప్రసాద్, భాను నాయక్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కీర్తి శ్రవణ్, డీపీహెచ్‌ఎన్‌వో వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లపై వేధింపులను నిరసిస్తూ ధర్నా



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

భీమవరం: డ్వాక్రా యానిమేటర్లపై రాజకీయ వేధింపులను అరికట్టాలని, వారికి వేతన బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డ్వాక్రా యానిమేటర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు ఎ.నిర్మల మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ వేధింపులు పెరిగాయని, వేధింపులు తట్టుకోలేక యానిమేటర్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. జిల్లాలో డ్వాక్రా యానిమేటర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సభలకు ప్రజలను కదిలించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, డ్వాక్రా గ్రూపుల నిర్వహణ, గ్రామ సంఘాల నిర్వహణ, పొదుపు వంటి అనేక విధులను నిర్వహిస్తున్నప్పటికీ తమది గుర్తింపు లేని పనిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లను పని ఒత్తిడికి గురిచేసి ప్రభుత్వం తన అవసరాలకు వాడుకోవడం తప్ప వారి సమస్యలను పట్టించుకోవడం లేదని చెప్పారు. అరకొర వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకుంటూ సంవత్సరాల తరబడి పని ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఆ ప్రభుత్వం చేసే నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే యానిమేటర్లపై రాజకీయ వేధింపులకు దిగడం అత్యంత దారుణమైన విషయమన్నారు. అనంతరం డీఆర్‌ఓకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు గోవిందమ్మ, మేరీ కుమారి, లక్ష్మీ భవాని పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధునిక పరికరాల వినియోగం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకుడు బి.గోవిందరాజులు

తాడేపల్లిగూడెం: వ్యవసాయంలో ఆధునిక స్వయంచాలక పరికరాల వినియోగం పెరగాలని ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు కోరారు. శనివారం వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేసిన బృంద చర్చల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో స్వయంచాలక పరికరాల వినియోగం, డ్రిప్‌తో మెరుగైన ఉత్పత్తి సాధన, నీటి వినియోగం తగ్గించడం, ఎరువుల సామర్థ్యం పెంచడంపై వివరించారు. మంచి దిగుబడులు పొందే విధానాల గురించి మాట్లాడారు. మోబిటెల్ అగ్రి ఆటోమేటెడ్ సొల్యూషన్ లిమిటెడ్ సాంకేతిక సహకారంతో కొబ్బరి, ఆయిల్ పాం పంటల్లో సెన్సర్ల ద్వారా నీటి వినియోగ పద్ధతుల గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఆనంద్‌కుమార్, డాక్టర్ ఏ.మాధవి, ఇ.కరుణశ్రీలు మాట్లాడారు.

బాస్కెట్‌బాల్ క్వార్టర్స్‌కు ఏలూరు, నూజివీడు



వైజాగ్, ఏలూరు జట్ల మధ్య మ్యాచ్

ఏలూరు రూరల్: ఏలూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో శనివారం లీగ్ మ్యాచ్‌లు అలరించాయి. భీమవరం, విజయవాడ మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. 71–72 తేడాతో విజయవాడ గెలుపొందింది. నూజివీడు వీటీహెచ్ జట్టు ప్రతిభ చాటి 39–55 స్కోరుతో మార్టేరు జట్టును ఓడించింది. ఏలూరు జట్టుపై ఆశ్రం కళాశాల జట్టు 18–30 స్కోరుతో గెలుపొందింది. తాడేపల్లిగూడెంను 43–13 స్కోర్‌తో రామచంద్రపురం ఓడించింది. రాజమండ్రిని 53–44 స్కోర్‌తో చిత్తూరు ఓడించింది. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ చెప్పారు.

గుంతలతో దినదినగండం

- ప్రాణాలు పోయేలా ఉన్నా పట్టించుకోని పాలకులు
- వాహనచోదకుల ఆవేదన



చింతలపూడి - సత్తుపల్లి ప్రధాన రహదారిలో రేచర్ల గ్రామం వద్ద గోతులు

చింతలపూడి : అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపడంలేదు. దీంతో నిత్యం గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోతేనే కాని రోడ్లు నిర్మించరా అని ప్రయాణికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు మెట్ట ప్రాంతంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాలకు రోడ్లపైకి నీరుచేరి మెయిన్ రోడ్డుపై అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. చింతలపూడి, గురుభట్లగూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, చింతలపూడి సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, టి.నరసాపురం రోడ్లపై పలు ప్రాంతాల్లో వర్షాలకు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో చింతలపూడి, సీతానగరం మీదుగా వెళ్లే హైదరాబాద్ బస్సును గురుభట్లగూడెం రోడ్డు మీదుగా మళ్లించారు. అదే విధంగా సీతానగరం, పట్టాయిగూడెం, నామవరం మీదుగా ఏలూరు వెళ్లే బస్సు సైతం గతంలోనే రద్దు చేశారు. చింతలపూడి నుంచి జంగారెడ్డిగూడెం రహదారి 8 కిలో మీటర్లు మరమ్మతులు చేస్తే సరిపోతుంది. ఈ రహదారిలో ప్రయాణం ఆర్టీసీ బస్సులకు కూడా ప్రాణ సంకటంగా మారింది. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు గోతుల్లో పడి గుల్లగుల్లవుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట వరకు 10 కిలో మీటర్లు గోతులు తప్ప రోడ్డు కనిపించదు. ప్రధాన రహదారులకు ఇరుపక్కలా కొందరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లను ఆక్రమించి మట్టి పోయడంతో రోడ్లు కోతకు గురవుతున్నాయి. వర్షపు నీరు రోడ్లపై చేరి దెబ్బతింటున్నాయి. రాత్రి సమయాల్లో గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కామవరపుకోట మండలం నారాయణపురం వద్ద ధ్వంసమైన ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు



కామవరపుకోట -చింతలపూడి ప్రధాన రహదారి జీలకర్రగూడెం వద్ద పరిస్థితి

నరకం చూస్తున్నాం



ప్రతి ఏటా వర్షా కాలంలో రోడ్లు రొచ్చు, రొచ్చుగా తయారవుతున్నాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లు అభివద్ధి చేయాలి.

– తొర్లపాటి బాబు, చింతలపూడి

ఈ రోడ్లెక్కితే యమపురికే!

భీమడోలు : ఏలూరు జిల్లాలో గత మూడు నెలలుగా కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ద్విచక్రవాహనదారులకు గుంతల రోడ్లు చుక్కలు చూపిస్తున్నాయి. ఆదమరిస్తే గోతుల్లో పడి గాయాల పాలవడమో లేక ప్రాణాలు పోవడం ఖాయం. కళ్ల ముందు పెద్ద పెద్ద గుంతలతో రోడ్లు కనిపిస్తున్నా అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు. భీమడోలు మండలంలోని వివిధ శాఖలకు చెందిన ప్రధాన రోడ్లు దారుణంగా మారడంతో రోజూ ఈ రోడ్లపై ప్రయాణించే రైతులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నరకాన్ని చవి చూస్తున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్ అండ్ బీ రోడ్డులో అడుగుకో గొయ్యి పడింది. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు మూడు కిలోమీటర్ల రోడ్డును దాటాలంటే భయపడుతున్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎం పురం నుంచి సాయన్నపాలెం వరకు 6 కిలోమీటర్ల రోడ్డు అడుగుకో గుంతలా మారింది. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే బైక్‌తో కుస్తీ పట్టాల్సిందే. ఆదమరిస్తే పక్కనే ఉన్న పంట పొలాల్లో గానీ, డ్రైనేజీలో గానీ పడిపోవడం ఖాయం. భీమడోలు కోమటిగుంట రోడ్డు గోతులతో నిండిపోయింది. సూరప్పగూడెం, కంద్రిగ, మలకచర్ల తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు నుంచి భీమడోలు రావాలంటే అవస్థలు పడుతున్నారు. కొల్లేరులోని చెట్టున్నపాడు నుంచి మల్లవరం వరకు రోడ్డు దెబ్బతింది. వివిధ గ్రామాలకు ఈ రహదారి వెంటే వెళ్లాలి. రోడ్లన్నీ ఇలా ఉంటే రాకపోకలు ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



భీమడోలు జంక్షన్ నుంచి గేటు రోడ్డుపై ప్రాణ సంకటంగా గోతులు



భీమడోలులో గోతులతో నిండిన కోమటిగుంట రోడ్డు



కొల్లేరులోని చెట్టున్నపాడు నుంచి మల్లవరం రోడ్డుపై ప్రయాణం నరకమే

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఆవేదన

ఏలూరు టౌన్: ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, పూర్తిగా ఫీజు చెల్లించినా సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఒక విద్యార్థి కాలేజీ ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని ఏలూరు జీజీహెచ్‌కు చేర్పించగా.. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. నగర శివారు వట్లూరుకు చెందిన చేబోయిన అచ్యుత్ ఏలూరు ఎస్‌ఆర్‌పేటలోని ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కాలేజీకి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవి జూనియర్ కాలేజీలో గత ఏడాది ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించాడు. సర్టిఫికెట్ల కోసం అనేక సార్లు కళాశాలకు వెళ్లినా ప్రిన్సిపల్ మురళీ ఇవ్వకుండా తిప్పుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మొత్తం ఫీజులన్నీ కట్టేసినా... ఇంకా కట్టాలని వేధించారంటూ అతను ఆరోపించాడు. హిమాచల్ ప్రదేశ్‌లో కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సి ఉండగా.. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. తీవ్ర మనస్థాపంతో అచ్యుత్ కళాశాల ప్రాంగణంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



విద్యార్థిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు

విద్యార్థి నేతల ఆందోళన

అచ్యుత్‌కు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఆధ్వర్యంలో విద్యార్థి నేతలు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కళాశాల ముందు బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కాలేజీ వద్దకు వెళ్ళి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. అనంతరం విద్యార్థి సంఘాల నేతలు జీజీహెచ్‌కు వెళ్ళి విద్యార్థిని పరామర్శించారు. కాకి నాని, శివరావు మాట్లాడుతూ... ఎస్‌వీఆర్‌కే కళాశాల యాజమాన్య తీరు సరిగా లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారంటూ మండిపడ్డారు. కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీలో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

ఉంగుటూరు: నారాయణపురంలో కారు ఢీకొని సంకు ధనలక్ష్మి (57) మృతిచెందింది. కారు పార్కింగ్ చేస్తున్న సమయంలో కారు నడిపే వ్యక్తి అజాగ్రత్తగా బ్రేక్‌కు బదులు ఎక్సలేటర్ నొక్కడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెదనింద్రకొలనుకు చెందిన నడివింటి వెంకటేశ్వరరావు నారాయణపురంలో ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. కింది పోర్షన్‌లో మృతురాలి చెల్లెలు కుమారి అద్దెకు ఉంటుంది. పక్కింట్లోనే ఉంటున్న అక్క ధనలక్ష్మి.. కుమారితో ఇంటి బయట మాట్లాడుతుండగా వెంకటేశ్వరరావు కారు పార్కింగ్ చేస్తూ అజాగ్రత్తగా ధనలక్ష్మిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై ఎస్సై సూర్య భగవాన్ మాట్లాడుతూ.. ఈ ప్రమాదం ఘటన తెలిసిందని, అయితే ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

కొండ చిలువ కలకలం



భీమవరం: భీమవరం పట్టణంలోని గొల్లవానితిప్పరోడ్డులో ఒక ఇంట్లో కొండచిలువ కలకలం రేపింది. యనమదుర్రు కాలువ గట్టున ఉన్న ఇంట్లో మహిళ శనివారం ఉదయం ఇల్లు ఊడ్చుతుండగా మంచం కింద కొండచిలువ గమనించింది. చుట్టుపక్కలవారికి విషయం చెప్పడంతో.. కొంతమంది కొండచిలువను బయటకు తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. భయంతో కొండచిలువను హతమార్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా విష సర్పాలు కొట్టుకువచ్చి ఇళ్లల్లోకి చేరుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ బోర్డు శిలాఫలకం ధ్వంసం



దెందులూరు: దెందులూరు మండలం కంద్రిక నరసింహపురం సచివాలయం బోర్డు శిలాఫలకాన్ని శనివారం దుండగులు ధ్వంసం చేసారు. గ్రామ సర్పంచ్ మెండెం సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి ముకుంద వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దిరాజు, నాయకులు హరీష్, రవి, మహేష్, గ్రామస్తులు ఈ సంఘటనను ఖండించారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

నిడమర్రు: వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు, చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్‌జిల్లా ముఠాను అరెస్టు చేసినట్లు నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. భీమవరానికి చెందిన జువ్వల తరుణ్‌కుమార్ (యనమదుర్రు), మామిడి దుర్గారావు (బలుసుమూడి), బేత దుర్గా ప్రసాద్ (బేతనీపేట), యంత్రపాటి రవి(సుంకరపద్దయ్యగారి వీధి) ముఠాగా ఏర్పడి ఉభయగోదావరి జిల్లాలతోపాటు విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు జిల్లాల పరిధిలో ద్విచక్రవాహనాలు, దేవాలయాల్లో హుండీలతోపాటు ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని క్రొవ్విడి గ్రామంలోని ఉప్పరగూడెం ప్రాంతంలో ఈ ముఠా ఉన్నట్లు సమాచారం తెలుసుకుని వారిని అరెస్టు చేసినట్లు నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు.

పచ్చనేతల అండదండలతో..

- ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు
- ఎమ్మెల్యే కామినేని పేరుచెప్పి అధికారులకు బెదిరింపు

కైకలూరు : కైకలూరు – ఏలూరు రోడ్డులో మండవల్లి మండలం చింతపాడు పంచాయతీ పరిధి దయ్యంపాడు వద్ద రీ సర్వే 68లో అర్‌అండ్‌బీకి సంబంధించిన ఎకరం 3.42 సెంట్లలో టీడీపీ నేత ముంగర ఏడుకొండలు అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడు. నోటీసులిచ్చినా కూటమి నేతల అండదండలతో అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు పాల్పడగా.. జేసీబీతో కొంతమేర ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. జూలై 10న పంచాయతీ సెక్రటరీ టి.శ్రీనివాస్ నోటీసులు ఇచ్చారు. అప్పటికీ నిర్మాణాలు ఆపలేదు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై జూలై 18న ఈఓపీఆర్డీ, పంచాయతీ సెక్రటరీలు డీపీవోకు నివేదిక ఇచ్చారు. అయినప్పటికీ లెక్క చేయకుండా ఆక్రమణదారుడు ప్రస్తుతం 3.42 సెంట్లలో నిర్మాణం చేస్తున్నాడు. దీంతో ఈ నెల 3న వీఆర్వో, ఆర్‌అండ్‌బీ అధికారులు అడ్డుకున్నారు. ఇప్పుడు మళ్లీ పనులు చేపట్టాడు. చివరికి శనివారం చింతపాడు పంచాయతీ సెక్రటరీ ప్రభాకరరావు మరోసారి పంచాయతీ నుంచి నోటీసులు అందించారు.



ఈ ఏడాది మార్చి 18న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు (ఫైల్)

కూటమి నేతల అండదండలతో..

కూటమి నేతలతో ఆక్రమణదారుడు సాన్నిహిత్యం పెంచుకున్నాడు. కలెక్టర్ దగ్గరకు వెళ్తాలన్నా, ఎమ్మెల్యే కామినేని కార్యక్రమాల్లోనూ ఇతను తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే అక్రమ నిర్మాణం దగ్గరకు అధికారులు వస్తే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేరు చెప్పి బెదిరిస్తున్నాడు. వాస్తవానికి ఇది ఆర్‌అండ్‌బీ మార్జిన్‌కు సంబంధించిన భూమి. పైగా కైకలూరు–ఏలూరు రహదారిలో రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణం కనిపిస్తోంది. ఇంత దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులను లెక్కచేయకుండా నియంతలా వ్యవహరిస్తున్నా కబ్జాదారునిపై ప్రభుత్వం చర్యలు తీసుకోపోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వానికి చెందిన భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేయడం వాస్తవమేనని చింతపాడు వీఆర్వో యువరాజు చెప్పారు. ఇది తప్పని ఆక్రమణదారుడికి చెప్పామన్నారు. నోటీసులు కూడా అందించామని.. సెలవు రోజుల్లో పనులు చేపడుతున్నారని గుర్తించామన్నారు.



శనివారం ఆక్రమణదారుడికి మూడోసారి నోటీసు అందిస్తున్న అధికారులు

గుట్టలు.. గుట్టుగా మాయం

కుక్కునూరు: పర్యావరణానికి, వన సంపదకు కేంద్రాలుగా ఉన్న గుట్టలను హరిస్తూ కొందరు అక్రమార్కులు అడ్డగోలుగా పట్టపగలే దోచేస్తున్నారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ రాజకీయ పలుకుబడితో పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీంతో కుక్కునూరు మండలంలోని గుండేటివాగు, ఎర్రబోరు, ఇబ్రహీంపేట, వేలేరు తదితర ప్రాంతాలలో గ్రావెల్ గుట్టలు కనుమరుగయ్యే స్థితికి చేరుకున్నాయి.

అడ్డూఅదుపు లేకుండా తవ్వకాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మండలంలో ఏదో మూల గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని, గుట్టల్లోని మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అదేంటని అడిగితే.. మండలాన్ని దాటిస్తున్నామా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక అవసరాల కోసమే మట్టిని వాడుతున్నామని చెబుతున్నారు.



గ్రావెల్ తవ్వకాలతో కనుమరుగవుతున్న గుండేటివాగు సమీపంలోని ముగ్గు గుట్ట

తరిగిపోతున్న గుట్టలు

అక్రమార్కుల స్వార్థంతో ప్రభుత్వ భూముల్లోని గుట్టలు తరిగిపోతున్నాయి. ఇలానే కొనసాగితే గుట్టలు మాయమవడం ఖాయం. దీంతో పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాల విషయమై సంబంధిత అధికారులకు సమాచారాన్ని ఇచ్చినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో అధికారుల అండతోనే మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టి ప్రభుత్వ సంపదను కాపాడాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో గ్రావెల్‌ను తరలిస్తున్న అక్రమార్కులు

విద్యుత్ శాఖలో బదిలీపై ఆరోపణలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసి బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనంతరం తిరిగి నిషేధం విధించింది. అయినప్పటికీ విద్యుత్ సంస్థలో శనివారం జరిగిన ఒక బదిలీ ఏలూరు విద్యుత్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కే మధుకుమార్‌ను నరసాపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ శనివారం ఆదేశాలిచ్చారు. నరసాపురంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బీ సురేష్ కుమార్‌ను ఏలూరు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. సురేష్ కుమార్ మరో 6 నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. నిబంధనల ప్రకారం ఏడాది లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం జరిగిన బదిలీకి సంబంధించి రూ.7 లక్షల వరకూ చేతులు మారాయని, అందువల్లనే పదవీ విరమణకు దగ్గరలో ఉన్న అధికారిని బలవంతంగా బదిలీ చేశారని చెప్పుకుంటున్నారు.

క్లుప్తంగా

సహజ వ్యవసాయమే మేలు



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త కరుణశ్రీ

తాడేపల్లిగూడెం : సహజ వ్యవసాయం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఇ.కరుణశ్రీ అన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో శనివారం నిర్వహించారు. నవధాన్యాలు వేసుకోవడం వల్ల లాభాలు, జీవామృతం, ఘన జీవామృతం, వివిధ రకాల కషాయాలు, బయో కల్చర్స్ తయారీ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. బయో కల్చర్ తయారీకి ప్రెజర్ కుక్కర్‌ను అందజేశారు. పీఎం కిసాన్ ప్రధాని ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఉండవు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : ఖరీఫ్ 2024కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్, రైస్ మిల్లుల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సొసైటీ సిబ్బంది శిక్షణా కార్యక్రమం శనివారం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం కొనే ప్రక్రియపై అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీకృష్ణ, వ్యవసాయాధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నరసాపురం: పట్టణంలోని అరుంధతిపేటకు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో చటం ప్రకారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై జయలక్ష్మి చెప్పారు. శనివారం తెల్లవారుజామున బాలిక తల్లి ఫోన్ మాట్లాడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు రాగా, అదే సమయంలో మద్యం సేవించి ఉన్న ప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లి పడుకుని ఉన్న బాలిక పక్కన పడుకోబోయాడు. విషయం గమనించిన తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కైండెనెస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్యవతి నగర్ రోడ్డులోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. యోగా కోచ్ కరిబండి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. గట్టిం మాణిక్యాలరావు, కైండెనెస్ అధ్యక్షుడు గట్టిం ప్రవీణ్‌కృష్ణ, సెక్రటరీ పిల్ల వెంకన్నబాబు, సభ్యులు పొండు రంగారావు, నున్న నాగేశ్వరరావు, రాంబాబు, అపర్ణ ప్రసాద్, రామాంజనేయులు, సుభద్ర గుప్తా తదితరులు పర్యవేక్షించారు.

మానసిక ప్రశాంతత పొందినవారు అదృష్టవంతులు



ఆత్మాసాక్షాత్కారం పొందిన కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: ప్రపంచంలో అందరికన్నా అదృష్టవంతులు మానసిక ప్రశాంతత పొందినవారేనని కలెక్టర్ చదలవా నాగరాణి అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో శనివారం సహజయోగ ధ్యాన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ ప్రత్యేక పూజలు కొనసాగున్నాయి. సహజయోగ ఏపీ మాజీ స్టేట్ కో ఆర్డినేటర్ బొల్లా పద్మావతి యోగా, సహజ యోగా ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆత్మాసాక్షాత్కారం పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సహజయోగా లాంటి ధ్యాన కేంద్రాలు ప్రజలకు వరమని అన్నారు. అనంతరం గ్రామంలో డంపింగ్ యార్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణిని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్రం నిర్వాహకులు కె.కృష్ణంరాజు, సుబ్బరాజు, అప్పన హనుమంతరావు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సహజయోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో చెరువులు

- అభివృద్ధిపై నిర్లక్ష్యం
- చెత్తా చెదారాలతో నిండిన చెరువులు



పెద్ద శివాలయం వద్ద చెత్తా చెదారాలతో నిండిన చెరువు



అధ్వానంగా పాతూరులోని తాడేపల్లి చెరువు



సుబ్బారావుపేట డీఎస్ చెరువు దుస్థితి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కుళాయిలు లేని రోజుల్లో వన్ టౌన్, టూ టౌన్లలో పలు ప్రాంతాలలో చెరువులు ప్రజల దాహార్తిని తీర్చాయి. అనంతరం పాతూరు శివారులో పంపుల చెరువు రావడంతో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెరువులు నిరుపయోగంగా మారాయి. వీటి అభివృద్ధిపై నిర్లక్ష్యం నెలకొంది.

పలు చెరువులు కనుమరుగు

తాడేపల్లిగూడెం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే సుమారు 26 చెరువుల్లో నేడు చాలా వరకు కనుమరుగయ్యాయి. వన్‌టౌన్‌లో పాతూరు ఏరియాలో తాడేపల్లిచెరువు, అదే ప్రాంతంలో సంజీవ నగర్ ఉన్నత పాఠశాల ఎదురుగా చెరువు, మునిసిపల్ కార్యాలయం వద్ద అనంతమ్మ చెరువు, టీటీడీ కల్యాణ మండపం నుంచి మామిడితోట ఏరియాలో రెండు చెరువులు, గొల్లగూడెం చెరువు, సుబ్బారావుపేటలోని డీఎస్ చెరువు, కొండాలమ్మ చెరువు, మామిడాల చెరువు, వానపల్లిగూడెం చెరువు, వీకర్స్ కాలనీలోని పసర్ల చెరువు, కడకట్ల తోట సమీపంలోని చెరువు, కడకట్లలోని చెరువులు, గోగులమ్మ గుడి వద్ద చెరువు, కొండయ్య చెరువులు ఉన్నాయి. టూ టౌన్‌లో జువ్వలపాలెంలో రెండు, మూడు చెరువులు, పెద్ద శివాలయం సమీపంలోని కృష్ణుడు చెరువు, భాగ్యలక్ష్మీపేటలోని ఆంజనేయ స్వామి గుడి చెరువు, రామచంద్రరావు పేటలోని కృష్ణుడు చెరువు, యాగర్లపల్లి సమీపంలోని చెరువులు, ముదునూరుపాడు బాల వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చెరువు, అదే ప్రాంతంలో కేఎస్ రోడ్డుకు పక్కగా చెరువు, ఇలా పట్టణంలో పలు చెరువులు ఉన్నాయి. వీటిలో కొన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. మరికొన్ని చెరువులు ఖాళీ స్థలాలుగా మార్చేశారు. ఇంకొన్ని చెరువులు వర్షపు నీరు, డ్రెయినేజీ వ్యర్థాలతో మురుగు కూపాలుగా తయారయ్యాయి.

చెరువులను కాపాడాలి

సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ మేరకు చెరువులను చెరువులుగానే ఉంచాలని, అక్రమించరాదని వాటిలో అక్రమణలు ఉంటే తొలగించాలని, వాటిని అభివృద్ధి చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చింది. అయితే చెరువులు కబ్జాకు గురైన, స్థలాలు కింద మార్పు చేసినా, పూడ్చిన పట్టించుకునే పరిస్థితులు లేదు. ఇంటింటికీ ఇంకుడు గుంట్లు తవ్వే బదులు ఉన్న చెరువులను కాపాడితే అవే పెద్ద ఇంకుడు గుంటలగా మారుతాయి. భూగర్భ జలాలు సైతం పెరుగుతాయి. పశుపక్ష్యాదులకు సైతం దాహార్తిని తీరుస్తాయి. చెరువుల చుట్టూ ఆక్రమణలను తొలగించాలని, చెరువుల్లో చేరిన వ్యర్థాలను తొలగించి, చెరువు గట్లను పెంచి, ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వాటిని తీర్చిదాద్దలని ప్రజలు కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్, ఆహ్లాదకరమైన వాతావరణం, ట్రాక్ చుట్టూ అవసరమైన చోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలంటున్నారు.

వ్యర్థాలతో దుర్గంధం

ప్రస్తుతం కొన్ని చెరువులు వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. సుబ్బారావుపేటలోని డీఎస్ చెరువు తూడుతో నిండి ఉంది. పాతూరు చెరువులో డ్రెయినేజీ వ్యర్థాలు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కడకట్ల కొండయ్య చెరువును అభివృద్ధి చేయడంతో పాటు బోట్ క్లబ్ చేస్తామని చేసిన ప్రకటన నేటికీ అమలుకాలేదు. పెద్ద శివాలయం వద్ద కృష్ణుడు చెరువు కబ్జాలకు గురైంది. రైల్వే ట్రాక్ దగ్గరలో ఉండటం, చెరువు చుట్టూ అక్రమణలు ఉండటంతో ఆ చెరువును గుర్తించే పరిస్థితి లేదు.

ఆహ్లాదకరంగా మార్చాలి



పట్టణంలోని చెరువులు క్రమక్రమంగా కన్పించడం లేదు. ఇప్పటికే పట్టణంలోని అనేక చెరువులను పూడ్చివేశారు. రూపురేఖలు కూడా లేకుండా చేశారు. ప్రస్తుతం ఉన్న చెరువులను బాగు చేయాలి. అహ్లాదకరంగా మార్చాలి. బోటు క్లబ్‌లు రూపొందించాలి. అందరికి ఉపయోగపడే విధంగా చూడాలి.

– వి.లక్ష్మీనారాయణ, వ్యాపారస్తులు

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు



నీలాద్రిపురంలో వీర్రాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను శనివారం మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. పట్టణంలోని 24వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు దత్తి కృష్ణ తండ్రి సీతారామయ్య ఇటీవల మృతి చెందారు. అలాగే, 24వ వార్డు ఇన్‌చార్జి యజ్జల రాంబాబు, తోట రాజబాబు, కొండపల్లి భాస్కరరావు (కడియద్ద), తాడేపల్లి వీర్రాజు (నీలాద్రిపురం), కాసగాని ధనలక్ష్మి (పట్టింపాలెం) కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కొట్టు సత్యనారాయణ వెంట నాయకులు కర్రి భాస్కరరావు, చెన్నా జనార్ధనరావు, బొద్దాని శ్రీనివాస్, 25వ వార్డు ఇన్‌చార్జి అశోక్ దొర, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, గణపతి, మండల నాయకులు బూరయ్య, కొండపల్లి బుజ్జి, నూనె రాధాకృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు మట్టా సత్యనారాయణ, జంపెల్లి సత్యవతి, గ్రామనాయకులు పాల్గొన్నారు.

నూతన అధికారులకు అభినందనలు



అధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ సిబ్బంది

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన అధికారులను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ కార్యదర్శులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కొత్తగా వచ్చిన పీవీవీ రామ్‌ప్రసాద్, ఏఓ కృష్ణచంద్రరావు, పంచాయతీరాజ్ ఏఈ జీ శ్రీనివాస్‌రావులకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యకర జీవనానికి మార్గమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని మూడో వార్డు కొబ్బరితోట ఏరియాలో శనివారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ, కీటక జనిత వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఇంట్లోను ఖర్చురహితమైన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆచరిస్తే దోమ పుట్టుకను నివారించవచ్చని, తద్వారా ఎటువంటి జ్వరాలు, వ్యాధులు సంక్రమించవని వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మూతలు వేసి ఉంచిన ఆహార పదార్థాలనే తీసుకోవాలని, ఒంటిని కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలని, ఇంటి ఆవరణలో బంతి, పుదీనా మొక్కలను పెంచడం ద్వారా దోమలను నివారించవచ్చని అన్నారు. మొక్కల కుండీలు, రుబ్బురోళ్ల పాత్రల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించి, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలంటూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం



గూడెం బలుసులమ్మ




గూడెం వాసవీమాత



గూడెం సర్వమంగళమ్మ




గూడెం శ్రీదేవీ మహంకాళమ్మ



గూడెం శంకరమఠం పోలేరాంబ



గూడెం విశ్వదుర్గేశ్వరి పేటలో..



బాలాత్రిపుర సుందరి



కాగులంపాడు దుర్గమ్మ



ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో..



ఆరవల్లి కనకదుర్గమ్మ



దువ్వ దానేశ్వరి



మండపాక యల్లారమ్మ



మంచిలిలో ఊరేగుతున్న భవానీ భక్తులు

తాడేపల్లిగూడెం : కరుణించి మమ్మేలు మా కన్నతల్లి. దీవించి కాపాడు చల్లని మాత. చల్లని తల్లి సిరుల వల్లి అంటూ శనివారం జగన్మాతను వివిధ రూపాల్లో ప్రార్థిస్తూ దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ప్రత్యేక పూజలు చేశారు. అలంకారాలతో పాటు, శాంతి పూజలు, హోమాలు, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని శంకర మఠంలో పోలేరాంబకు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వదుర్గేశ్వరిని పచ్చని పైరుల మధ్య కొలువైన తల్లిగా తీర్చిదిద్ది పూజిస్తున్నారు.

అమ్మవార్లకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం మూడో రోజు వివిధ అలంకరణల్లో అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. బలుసులమ్మ, వాసవీ కన్యపరమేశ్వరి, శంకరమఠంలో సర్వమంగళమ్మ వార్లు గాయత్రీ దేవిగా, శ్రీదేవి మహంకాళి, బ్రహ్మానందరెడ్డి మార్కెట్, వార్ఫ్‌రోడ్డుల్లోని అమ్మవార్లు, విశ్వదుర్గేశ్వరీ సమేత అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బలుసులమ్మ ఆలయంలో నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షణలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా మహోత్సవాలు

చంద్రఘంటా దేవిగా బాలాత్రిపుర సుందరి దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పీఠంలోని అమ్మవారిని చంద్ర ఘంటాదేవిగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలోని విశ్వేశ్వర శివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం చేసి, అర్ధనారీశ్వర స్వరూపంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చండీ హోమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి శ్రీకృష్ణబాబు, ఆర్టీఓ వెంకటేశ్వరరావు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. 9వ తేదీన మూలానక్షత్రం సందర్భంగా మేధా సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామని పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించి, పూజలు చేశారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు : మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో స్వయంభువు కనకదుర్గమ్మ అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమించ్చారు. ఈనెల 11, 12 తేదీల్లో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను తెలిపారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శిపర్రు, కె.పెంటపాడులోని బైరాగిమఠం, బోడపాడు, పెంటపాడు, మౌంజీపాడు, మీనవల్లూరు, విప్పర్రు, జట్లపాలెం, ఉమామహేశ్వరం, చింతపల్లి తదితర గ్రామాల్లో దసరా మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవార్లు

అత్తిలి: మండలంలోని ఆరవల్లి కనకదుర్గా భవాని అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మంచిలి రమా సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో నెలకొలిన శ్రీవిజయ కనకదుర్గమ్మవారి పీఠంలో వీరవల్లి అంతర్వేది, వీరవల్లి వెంకటరమణ దంపతులు పూజలు చేశారు. భవానీలు, మహిళలు శిరస్సుపై కలశాలను ధరించి గ్రామంలో ఊరేగి అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి మొక్కలు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

తణుకు టౌన్: తణుకు మండలం దువ్వ దానేశ్వరి మహాలక్ష్మిగా, మండపాక యల్లారమ్మ గాయిత్రీ దేవీ పూజలు అందుకున్నారు. వేల్పూరు ఈశ్వరమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తణుకు కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో గాయిత్రీ దేవీ అలంకరణలో అమ్మవారు పూజలు అందుకున్నారు.

ఉచిత ఇసుక అమలు చేయకపోతే సత్యాగ్రహమే



తణుకు : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్ : జగ్గన్నపేటలో మాట్లాడుతున్న ఆదినారాయణ

తణుకు / తణుకు టౌన్ : ఉచిత ఇసుక విధానం తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో సత్యాగ్రహం చేస్తామని ప్రభుత్వాన్ని సీపీఎం హెచ్చరించింది. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ తణుకు శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కామన మునిస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే మిన్నగా పాలన సాగిస్తామని కూటమి ప్రభుత్వం ప్రజలకు వాగ్దానం చేసి 100 రోజులైనా అమలు చేయకుండా మా ప్రభుత్వం మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ విధానం కారణంగా రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని ఆరోపించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.4 వేలు ఖర్చయితే ప్రస్తుతం ఉచిత ఇసుక పేరుతో ట్రాక్టరు ఇసుకకు రూ.7 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్ గార రంగారావు, భవన నిర్మాణ కార్మికులు బొద్రా రామచంద్రరావు, సుమల శంకర్‌బాబు, బర్రె పరమేశ్వరరావు, రెల్లు నాగరాజు పాల్గొన్నారు.

పడకేసిన ఉచిత ఇసుక లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: అక్రమ రవాణాదారుల వల్ల ప్రభుత్వ ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరలేదని భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ అధిక ధరలకు బ్లాక్‌లో ఇసుకను విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిర్మాణదారులకు ఇసుక అందడం లేదని, ఫలితంగా పనులు నిలిచిపోవడంతో ఉపాధి దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో అనేక లోపాలు ఉన్నాయన్నారు. అక్రమార్కులు సిండికేట్ అయి బ్లాక్ నడిపిస్తున్నారని విమర్శించారు. సగటున ఇసుక 10 టన్నులు రూ.15 వేలు, 20 టన్నులు రూ.25 వేలకు విక్రయిస్తున్నారన్నారు. జగ్గన్నపేట యూనియన్ అధ్యక్షుడు కంకిపాడు రాజు మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వి.బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు మట్టా రాంబాబు, కూనపాముల శేఖర్, గౌరవాధ్యక్షుడు కె.సత్యనారాయణ, జాలాది బాలు, సీహెచ్ చంద్రశేఖర్, బి.భరతం, హరిప్రసాద్, చీలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉద్యాన యాత్ర



ఉద్యానవర్సిటీని సందర్శించిన విద్యార్థులతో అధికారులు

తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ఉద్యాన యాత్రలో భాగంగా శనివారం నల్లజర్లకు చెందిన విద్యార్థులు సందర్శించారు. వర్సిటీలోని మ్యూజియం, కళాశాల, వనాలు, పరిపాలనా భవనం, పరిశోధనా స్థానాలను పరిశీలించారు. కేవీకే సమన్వయ కర్త ఇ.కరుణశ్రీ, శాస్త్రవేత్తలు ప్రసాద రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, దీప్తి తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డి.ఎన్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కి చెందిన టీ.ఆర్ ఇన్నోవేటివ్ టెక్ సొల్యూషన్స్ ద్వారా మూడు రోజుల ఆండ్రాయిడ్ వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.ఎస్ వర్మ, డీన్ అడ్మిన్ డాక్టర్. ఎ.రామ్మూర్తి మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ప్రోగ్రామ్ వర్క్ షాప్‌తో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంలో వినూత్న మార్పులు వస్తున్నాయని వీటిపై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ ఆండ్రాయిడ్ వర్క్ షాప్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో కె.ఎస్.ఆర్ ప్రసాద్, ఎల్ బుజ్జిబాబు, బి. నందన్ కుమార్, ఈద జాషువా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించాలి

భీమవరం (ప్రకాశం చౌక్): ఆర్థిక అవసరాలకు విదేశాలకు వలస వెళ్లే అల్పాదాయ వర్గాల మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మెప్మా అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి మెప్మా అధికారులతో సమావేశమై ఆ శాఖ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చాలామంది మహిళలు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి మోసపోతున్నారని, వీటిని నిరోధించడానికి అల్పాదాయ వర్గాల మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా ఏవో బి.రజనీకాంత్, ఐబీ అధికారి జి.పార్వతి, జిల్లాలోని సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.